

ఈ స్వార్థ, సంకుచిత సమాజ సంకెళ్ళను స్త్రీలోకం ఆత్మస్థయిర్యంతో తుత్తునియలు చేయాలంటారు పద్మజా చౌదరి.

# అది ఆగదు

పెళ్ళిపందిరి కళకళలాడ్తోంది. పట్టుచీరలు రెపరెపలాడ్తున్నాయి.

పెళ్ళి కూతురు గుండె నిండా గుబులు.

కళ్ళ నిండా దిగులు.

ఉల్లాసంతో ఉరకలు వేయాల్సిన ఆమె హృదయం ఎందుకు చిన్నబోయిందో ఎవరూ అడగలేదు. అసలు చిన్నబోయి ఉందనీ ఎవరూ గ్రహించలేదు.

ఎవరి హడావుడి వాళ్ళదే!

ఊళ్ళ నుంచి వచ్చిన దగ్గరి బంధువులు వాళ్ళ గొడవల్లో వాళ్ళు ఏయే చీరలు కట్టుకోవాలో, నగలు పెట్టుకోవాలో తేల్చుకోలేక సతమతమైపోతున్నారు.

ఆమె మనసుకు దగ్గరివాళ్ళు ఒకటి, రెండు సార్లు చమత్కరించి, లాభం లేదని ఆ ప్రయత్నం విరమించుకున్నారు.

ఇక తల్లిదండ్రుల విషయం సరేసరి. తప్పదు కాబట్టి జరీ అంచు వస్త్రాలు ధరించి హడావుడిగా తిరుగుతున్నారు కానీ, వాళ్ళ మనసులూ అలాగే ఆరిపోయిన దీపాల్లా ఉన్నాయి.

హృదయాన్ని చిక్కబట్టుకొని జరగబోయేదానికి నిరీక్షిస్తున్నారు.

ఏదో జరుగుతుందని వాళ్ళకు కచ్చితంగా తెలిసినట్లే ఉంది.

సరిగ్గా ముహూర్తం సమయానికి బాజా భజంత్రీలతో పెళ్ళికొడుకు మిల మిల్లాడే కళ్ళతో వచ్చి మంగళపీఠికను అలంకరించాడు. అప్పుడు మోగిన మంగళవాద్యాలు పల్లవి గుండెల్లో పల్లకీలై పరుగెత్తాయి.

చెప్పలేని ఉద్విగ్నతతో ఆమె ఉల్లం ఊగిపోయింది. ఎటో చూస్తున్న చూపు ఒక స్థానంలో నిలిచిపోయింది.

పెండ్యులంలా ఊగిన ఊహలకూ స్థిరత్వం చేరుకుంది.

కళ్యాణ మండపంలో మాధుర్ వేదమంత్రాలను ఉచ్చరిస్తున్నాడు. చిరునవ్వుల వెలుగుల్ని మిత్రులపై సారిస్తున్నాడు.

అతని తల్లిదండ్రులు మాత్రం గొప్ప హడావుడిగా ఉన్నారు. మంత్రతంత్రాల మీదకు వాళ్ళ మనసు లగ్నం కావటం లేదు. అక్కడి నుంచి లేచి ఎటెటో తిరిగి ఎవర్నో పట్టుకున్నాడు రాజారావు.


అతనికలా దొరికిపోయిన వ్యక్తి పెళ్ళి కుదిర్చిన పెద్దమనిషి.

"ఏవిటయ్యా...ఇది?" అన్నాడు రాజారావు అతడ్ని నిందాత్మకంగా చూస్తూ.

అతడు తడబడ్డాడు.

తప్పు చేసినవానిలా తల దించుకున్నాడు.

చిత్రాలు: పి.ఎస్. బాబు



అందుకే అసలుకే పెళ్ళికి రావద్దనుకున్నాడు గానీ, తప్పలేదు.

"ఏవిటి?" అన్నాడు అమాయకంగా నటించే ప్రయత్నంలో.

"ఏవిటా? మీకు తెలియన్దిఏముంది? కట్నం తాలూకు డబ్బు పూర్తిగా అందలేదు." గట్టిగానే అన్నాడు.

"మెల్లగా" అన్నట్లు చూశాడు మధ్యవర్తి. కంగారుగా చుట్టూ చూశాడు.

ఎవరూ వాళ్ళకేసి చూడటం లేదు.


అప్పుడే వచ్చిన పెళ్ళికూతురి మీద అందరి దృక్కులూ నిలిచిపోయాయి.

ఆడవాళ్ళంతా పల్లవి ధరించిన చీర, నగల విలువల్ని అంచనా వేస్తున్నారు.

బుద్ధిగా, ఒద్దికగా కూర్చున్న కూతుర్ని

హడావుడిగా తిరుగుతున్నారు కానీ, వాళ్ళ మనసులూ అలాగే ఆరిపోయిన దీపాల్లా ఉన్నాయి. హృదయాన్ని చిక్కబట్టుకొని జరగబోయేదానికి నిరీక్షిస్తున్నారు. ఏదో జరుగుతుందని వాళ్ళకు కచ్చితంగా తెలిసినట్లే ఉంది.

**గుప్పిట్లోకి పసుపుబియ్యం తీసుకొని వదుల్తూ, తీసుకొని వదుల్తూ ఉండగా "లే.... ఇక" అన్నాడు రాజారావు. మాథుర్ ఇక ఆలస్యం చేయలేదు. విసురుగా లేచాడు. అతడు తండ్రిని సమీపించబోతుండగా "ఆగండి" అని వినిపించింది.**



తదేకంగా చూస్తున్న ఆమె తల్లిదండ్రులు - "జగ్గా" అన్న పిలుపుకు ఉలిక్కిపడి వెనక్కు చూశారు.

వాళ్ళు ఊహించినట్లు.... అలా కాదు, ఎదురుచూసినట్లు ఆ పిలుపు రామారావు నుంచి. పెళ్ళి కుదిర్చిన స్నేహితుడి కంఠం అది.

అలాంటి సందర్భాల్లో ఆ మిత్రుడి కంఠం భారమౌతుందని జగన్‌కు ముందే తెలుసు.

రాజారావును చూడగానే జగన్ కళ్ళు బెదరిపోయాయి. పారిపోతూ పట్టుబడ్డ దొంగలా ఉంది అతని స్థితి.

"జంట చూశారాండీ.. ఎంత చక్కగా.." శోభ వాక్యం సగంలోనే ఆగిపోయింది, వియ్యపురాలి రుసరుస చూపులకు.

జలుబు చేసిన పాప ఐస్‌క్రీం తింటూ అమ్మకు దొరికిపోయినప్పటి కంగారులో ఉందామె.

మెల్లగా నలుగురూ జనసందోహాన్ని తప్పుకొని ఏకాంతం కలిగించే ప్రశాంతతలోకి జారుకున్నారు.

అక్కడ ఆ నలుగురూ తప్ప మరో పురుగు లేదు.

రాజారావు చూపులతో ప్రశ్నించే తరుణంలోనే రామారావు ఎప్పుడో జారుకున్నాడు.

"ఇప్పుడు చెప్పండి" అన్నాడు రాజారావు గట్టిగా.

"ఏం చెప్పమంటారు?"

అసమర్థత, నిస్సహాయత జగన్ గొంతులో పోటీ పడ్తున్నాయి.

శోభ కళ్ళలో నీళ్ళు పిలిస్తే కిందికి ఉరికేలా ఉన్నాయి. ఉన్న ఒకగానొక్క కూతురు -

అందమైన పాపాయి అని అల్లారుముద్దుగా ఇరవై ఏళ్ళు పెంచుకున్న మురిపాల బిడ్డ -

సవేథగా, చిరునగవులతో ఒప్పారవలసిన పల్లవి -

అంతు చిక్కని ఆలోచన్లతో -

అంతం లేని చింతతో -

ఈ రోజును నిరీక్షించి వేగిపోయింది.

ఆమె కళ్ళలో కాంతి -

తలపుల్లో శాంతి - కరవైనాయని చూస్తూనే ఏమీ చేయలేక నిస్సహాయంగా ఉండిపోయిన తెలుగింటి తల్లిదండ్రులకు వాళ్ళిద్దరూ ప్రతీక.

"ముందు తెలియదుటండీ?" జాడించాడు రాజారావు.

"ఎందుకు తెలియదు? తెలుసు! అన్నీ కావాలి. ఊళ్ళో ఇల్లు... బ్యాంకులో ఉద్యోగం ఊరికే వస్తాయనుకుంటారు. పిల్ల బాగుంది కదా అని అక్కడికీ పాతిక వేలకే ఒప్పుకున్నాం. అందులోనూ సగం కత్తెర వేస్తిరి"- అతని భార్య లలిత.

"ఒక్క పదివేలు తగ్గాయండి. ఒక్క ఏడాది గడువిస్తే..." తానెంత తెలివి తక్కువగా అడుగుతున్నాడో ఎదుటి వ్యక్తి కళ్ళలో తారసలాడిన ఏవగింపు తెలియచేస్తుండగా సగంలోనే ఆపేశాడు.

"నేను ముందే చెప్పానండీ... పెళ్ళికి తరలి వచ్చేసరికి కట్నం డబ్బు పూర్తిగా అందాలని."

అంతటితో తన తప్పు లేదన్న ధీమా!

నిజమే. చెప్పారు.

ఆడబిడ్డ లాంఛనాల మాట...." - శోభ.

"అది ఎక్కడైనా ఉండేదే."

"అవుననుకోండి... ఆడబిడ్డ లాంఛనాలకు ఐదు వేలు, మీకందరికీ నచ్చే బట్టల కోసం వచ్చిన తేడా ఐదు వేలు.... సరిగ్గా...."

"ఆ పదివేలే తగ్గాయంటారు. భేష్! అయినా, ఇవన్నీ ముందుగా లెక్కలు వేసుకోవద్దూ!"

ఎందుకు వేసుకోవాలి?

హఠాత్తుగా ఆడబిడ్డకు ఐదువేలిమ్మంటారని ఎవరు కలగంటారు? తెచ్చిన బట్టలు నచ్చలేదని, అత్యంత ఖరీదైన పట్టుచీరలు కొనిపించే సంస్కారం వారిదని ఎవరైనా ఎందుకనుకోవాలి?

స్థిరపడిన సంబంధాన్ని వదులుకోలేక, పళ్ళ బిగువున అన్నీ వాళ్ళ ఇష్టానుసారం జరిపించారు.

ఆ మార్జిన్ -

ఇప్పుడు తన కూతురు జీవితాన్ని బలిపీఠం ఎక్కించింది.

బలి అవుతున్నానని తెలిసిన మూగజీవిలా ఆమె అదిగో ... అల్లంత దూరంలో నిస్సహాయంగా ఇటే చూస్తూ - ఏం జరుగుతుందో అన్న కలతతో కళ్ళు వాల్చేసుకుంది.

ఆమె గుండె దడ దడ - ఇక్కడిదాకా పాకి ఆ తల్లిదండ్రుల గుండెల్ని కలచివేస్తోంది.

"అనుకోని ఖర్చులు ... అన్ని ఖర్చులూ ఒకేసారి రావడం వల్ల ఇప్పటికిప్పుడు డబ్బు సిద్ధం చేయలేకపోయాను. కనీసం ఓ ఆర్నెల్ల టైం ఇప్పిస్తే వడ్డీతో సహా తీర్చుకుంటాను. నన్ను నమ్మండి" - జగన్.

"ఇప్పుడే కదండీ సంవత్సరం గడువు అడిగారు. ఇంతలోనే ఆర్నెల్లకు దిగారు. ఇంకొంచెం గట్టిగా అడిగితే ఇప్పుడే ఇచ్చేలా ఉన్నారు."

అది నిస్సందేహంగా వ్యంగ్యమే. సందేహం లేదు.

ఒకరి వ్యక్తిత్వాన్ని మరో వ్యక్తి ఎద్దేవా చేసే అవకాశం ఇలాంటప్పుడే లభిస్తుంది. మరెప్పుడూ ... ఏ మగవాడూ మరొకనికి ఆ ఆస్కారం ఇవ్వడు.

దూరంగా మంగళవాద్యాలు.

మాంగల్యధారణకు పెళ్ళికొడుకు లేచాడు.

రాజారావు ఓ క్షణం నిశ్శబ్దమైపోయాడు.

మరుక్షణమే ఏదో నిర్ణయానికి వచ్చినవానిలా గుండెల నిండా ఊపిరి తీసుకుని వదిలాడు.

లిప్తకాలం పాటు జగన్, శోభ మనసుల్లో ప్రశాంతత.

ఏకాంతంగా ఉన్న వనంలోకి సుదూరం నుంచి సాగివచ్చిన కళ్యాణ రాగంలా.

"ఇంకేముందిలెండి! వాడు వీళ్ళ అల్లుడయ్యాడు. ఇక వీళ్ళు డబ్బు ఇస్తే ఇస్తారు...లేకపోతే లేదు. వాళ్ళ దయ!" ఆమె కంఠంలో దాగని కసి.

పసిపాప బోసినవ్వులాటి వారి ఆనందపు చరియల్ని మసి చేయగలిగిన కసి.

శోభ గుండె వణకింది.

ఆ మూడు ముళ్ళూ పడ్డాయి. చాలునన్న తృప్తి ఎంతోసేపు నిలువలేదు. తన కూతురి జీవితం చీకటి కుహరంలోకి తోసివేయబడిందేమో అన్న అనుమానం తుపానులా ఆమెను ఛిన్నాభిన్నం చేసింది.

బేలగా భర్తకేసి చూసింది.

ఆమె అతడ్ని అలా చూసినప్పుడల్లా అతడు ఆమెకు అండగా నిలిచాడు. తన సర్వశక్తుల్నీ ఒడ్డి ఆమెకు నిశ్చింతను ప్రసాదిస్తూ వచ్చాడు.

ఇప్పుడతనికి ఆ శక్తి లేదు. అతని ఆయుధాలన్నీ నిరుపయోగం - ఎటో చూడసాగాడు, ఆమె చూపుల్ని తప్పించుకుంటూ

"ఇల్లు అలగ్గానే పండుగయిందా?" రాజారావు పెద్ద పెద్ద అంగలేసుకుంటూ వినవినలాడ్తూ కదిలాడు.

వెనుకే అతని సహధర్మచారిణి.

శోభ, జగన్ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

నెమ్మదిగా గుండెల్ని చిక్కబట్టుకొని కళ్యాణమండపం దిశగా అడుగులు వేస్తూ -

ఒకర్నొకరు తెలియనివాళ్ళలా ఎటో చూసుకుంటూ - "లేరా!" అన్నాడు రాజారావు దగ్గరగా వెళ్ళి.

తలంబ్రాల్లో చెయ్యి పెట్టబోతున్న మాధుర్ ఆగిపోయాడు. తండ్రికేసి చూశాడు.

"ఏవిటీ?"

"ఎందుకు?" అని అడక్కుండానే అతనికి అర్థమైపోయింది.

గుప్పిట్లోకి పసుపుబియ్యం తీసుకొని వదుల్తూ, తీసుకొని వదుల్తూ ఉండగా -

"లే... ఇక" అన్నాడు రాజారావు

మాధుర్ ఇక ఆలస్యం చేయలేదు.

విసురుగా లేచాడు.

అతడు తండ్రిని సమీపించబోతుండగా -

"ఆగండి" అని వినిపించింది.

మాధుర్ నివ్వెరపోయి వెనక్కు చూశాడు.

పల్లవి కంఠం శాసిస్తోంది.

ఆమె కళ్ళు నిలదీస్తున్నాయి,

సిగ్గుదొంతరల మధ్య -

వలపు ఊహలలో -

ఊగిసలాడవలసిన నవోఢ -

పెళ్ళిపీటల మీద నుంచి లేచి నిలబడింది.

నిశితంగా, నిస్సంకోచంగా అతనికేసి చూసింది.

అతడింకా షాక్‌లో నుంచి తేరుకోలేదు.

"ఎక్కడికి వెళ్తున్నారు?" అడిగింది.

రాజారావు దెబ్బ తిన్న పులి అయ్యాడు.

"మీ అబ్బనడుగు చెప్తాడు" అన్నాడు.

దోషిలా తల దించుకున్న తండ్రికేసి ఆమె చూడదలచుకోలేదు. తన జన్మ తన తండ్రిని అసమర్థుని చేస్తే - ఆమె ఈ సాంఘిక వ్యవస్థను క్షమించదలచుకోలేదు.

సంఘ నియమాలనూ -

ఆచార వ్యవహారాలనూ తిప్పి రాయదలచుకుంది. నిద్దుర పొద్దులు ఎరుగని సమయాలు ఆమె గుండెల్లోకి రాత్రిలా జారిపోయి -

ఇప్పుడు -

కరిగిన మంచులా మారిపోయి -


ఆమె వ్యక్తిత్వానికి, ఆలోచన్ల ఆలంబనకు మెరుగులు దిద్దుతున్నాయి.

రాజారావు ఈసడింపును ఖాతరు చేయకుండా, పసుపుతాడుతో వేలాడుతున్న మంగళసూత్రాలను చూపుతూ -

"ఎక్కడికి వెళతారు?" అని ప్రశ్నించింది మళ్ళా.

మాధుర్ విమూఢుడయ్యాడు.

తండ్రికేసి నిస్సహాయంగా చూశాడు.



ఆ తగ్గిన పదివేలతోనే అతడు స్కూటరు కొనుక్కోవాలని పథకం వేసుకున్నాడు. పెళ్ళయ్యాక కూడా బ్యాంకుకు సైకిలు మీద వెళ్తే ఎంత నామోషీ!

పారాణి పాదాలతో -

కళ్యాణ తిలకంతో -

పచ్చటి తాడుతో -

వలపు హృదయంతో -

నిల్చున్న ఆమె అతడ్ని కదిలించలేకపోయింది.


అతని ఆలోచనాపథంలో తావు చేసుకోలేకపోయింది!

ఎంత నిర్దయగా లేచిపోయాడు!

ఎంత నిర్లజ్జగా నిల్చుండి

రాజారావు ఈసడింపును ఖాతరు చేయకుండా, పసుపుతాడుతో వేలాడుతున్న మంగళసూత్రాలను చూపుతూ "ఎక్కడికి వెళతారు?" అని ప్రశ్నించింది మళ్ళా. మాధుర్ విమూఢుడయ్యాడు. తండ్రికేసి నిస్సహాయంగా చూశాడు.

**కళ్యాణతిలకంతో, నుదుట బాసికాలతో నిల్చున్న నవ వధువును తుచ్ఛమైన డబ్బుకోసం వదిలివెళ్ళే భర్తను నేను శాశ్వతంగా తృణీకరిస్తున్నాను. ఇది నా మనో న్యాయస్థానం నుంచి వచ్చిన తీర్పు.**



పోయాడు! ఇతడి తోటి జీవితం పంచుకునే అవకాశం తెగి పోతుందనా తాను ఇన్నినాళ్లూ కలత చెందింది.

విచ్చుకున్న మల్లెరేకుల్లాటి తన హృదయం ముకుళించుకు పోయింది.

పోతే పోనీ -

అంతమాత్రానికే ఈ జగం స్తంభించిపోతుందా?

ఆమెకు జవాబు చెప్పలేని అసమర్థత అతడ్ని మరింత అసమర్థుడ్ని చేసింది.

అతని కళ్ళలో ఎరుపు జీరలు.

ఆవేశంతో అధరాలు అదురుతున్నాయి.

"నిన్ను... నిన్ను... ఛీ... ఆడవాళ్ళు ఉండాల్సిన పద్ధతి ఇదేనా? ఇదేనా మన సంప్రదాయం?" అన్నాడు.

ఆమె నవ్వు ఎవ్వరికీ వినిపించలేదు.

ఆ నవ్వులో నిబిడీకృతమైన వ్యంగ్యం ఎవ్వరికీ కనుపించలేదు.

"ఇదేనా మన సంప్రదాయం? కట్టుకున్న భార్యను పెళ్ళిపీటల మీద త్యజించి వెళ్ళిపోవడమేనా?

ఏ దేశ సంస్కృతి ఇది?

ఏ యుగం నాటి సంప్రదాయం?

భర్త అంటే భరించవలసిన వాడు గాదా! డబ్బు కోసం ఆమెను వది లేయడం భర్త ధర్మమా?"

"చూడమ్మాయ్... నువ్వెక్కువ మాట్లాడుతున్నావు. మీ నాన్న సంప్రదాయం ప్రకారం ఇవ్వాల్సిన డబ్బును అందచెయ్యలేదు. ఇది మోసం! దగా! కుట్ర! దీన్ని నేను సహించలేను.

వర్డీ ప్రకారం నువ్వు ఆ డబ్బు తెచ్చి నా చేతిలో పోసి ... నా ఇంట అడుగు పెట్టవచ్చును. అప్పుడు వాడు వాడి భర్త ధర్మాలు నిర్వహిస్తాడు. ముందు నువ్వు నీ ధర్మం నిర్వహించు. తెలిసిందా?" - రాజారావు.

"వర్డీ ప్రకారం! ఇదేనా మీ అభిప్రాయమూను?" మాధుర్‌ని సూటిగా ప్రశ్నించింది.

అప్పుడే షాక్ నుంచి తేరుకున్న జగన్, శోభ హడావుడిగా వచ్చి ఆమెను వారించబోయారు.

"ష్..ష్.. ఆగండి నాన్నా.. నా జీవిత సమస్య ఇది. నేను తేల్చుకోవాలి. డబ్బు మనిషి మనుగడనే మార్చబోతోంటే, దానికి నేనా అవకాశం ఇవ్వను. మార్పులూ చేర్పులూ అన్నీ నేనే చేసుకుంటాను. నా భవిష్యత్తును నా చేతుల్తోనే రాసుకుంటాను. ఊఁ.... మీరు చెప్పండి." మాధుర్ దిశ తిరిగింది.

"అంతకన్నా చెప్పేది ఏముంటుంది? మా నాన్న చాలా న్యాయ సమ్మతంగా మాట్లాడారు. నిన్నేం మేం అసలుకే వద్దనటం లేదే!"

"డబ్బు ఎప్పుడు ముడితే అప్పుడు నాకు స్వాగతం చెప్తానంటారు! భేష్! అదే మీ నిర్ణయం అయితే, నా నిర్ణయమూ వినండి - పసుపు బట్టలతో, కళ్యాణతిలకంతో, నుదుట బాసికాలతో నిల్చున్న నవ వధువును తుచ్ఛమైన డబ్బు కోసం వదిలివెళ్ళే భర్తను నేను శాశ్వతంగా తృణీకరిస్తున్నాను. ఇది నా మనో న్యాయస్థానం నుంచి వచ్చిన తీర్పు."

కోలాహలంగా ఉన్న ఆ వేదిక నిశ్శబ్దమైపోయింది -

ఆకు రాలినా వినపడే నిశ్శబ్దం అక్కడ చోటు చేసుకుంది.

ఆనందం, సంభ్రమం, విచారం, ఆవేశం, ఆక్రోశం, ఆశ్చర్యం..... అనేక భావాలు ఒకేసారి ఉద్భవించిన క్షణమది.

ఆ క్షణానికి సృష్టికర్త ఆమె.

హుందాగా, దర్పంగా అందరికేసి చూస్తోంది.

ఆమె కళ్ళు వెయ్యి సూర్యకాంతులతో పోటీ పడ్తున్నాయి.

దెబ్బతిన్న పులి అయ్యాడు మాధుర్.

ఆకలిగొన్న సింహంలా మారాడు రాజారావు.

వారికే కనుక మనోశక్తులు ఉంటే ఆమెను నిలువునా దగ్ధం చేసి, ఆ బూడిదను తమ దేహమంతా రాసుకునేవారు.

"మరీ మంచిది... పోవే ...

"నువ్విలా బరితెగించినదానివని తెలియక సంబంధం కుదుర్చుకున్నాం. మా తప్పు లేకుండానే వదిలిపోయినందుకు సంతోషం. ఆ దండ తీసి దాని ముఖాన కొట్టి రారా అబ్బాయ్" అన్నాడు రాజారావు.

"మిస్టర్! మర్యాదగా మాట్లాడటం నేర్చుకోండి. వెళ్ళే ముందు మీరు నిర్వర్తించాల్సిన బాధ్యత మిగిలిపోయింది."

అందరి కళ్ళు ప్రశ్నార్థకంగా చూశాయి.

"ఇంతవరకూ మీకందిన డబ్బు, మీరు జులుం చేసి కొనిపించిన జరీ చీరలూ, వెండి సామాన్లూ పొల్లుపోకుండా ఇచ్చి వెళ్ళండి. వాటి విలువతో చిన్న షాపు పెట్టుకునైనా సరే నా భవిష్యత్తుకు బాట వేసుకుంటాను. అందులో ఏదీ తగ్గడానికి, పొరపాటు రావడానికి వీల్లేదు. మీరు మా నాన్న కాళ్ళు పట్టుకున్నా సరే మిమ్మల్ని నేను క్షమించను."

అంతటా నిశ్శబ్దం.

ఎక్కడో ఊరు చివర -

కొండ దాటి -

ఏరు పారుతూనే ఉంది, ఎన్నో అడ్డంకుల్ని అధిగమించి.

అది ఆగదు.

సాగుతూనే ఉంటుంది. ■